# మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత

## లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోతు నరేశ్ నాయక్



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి, మరిమడ్ల, గ్రామాల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమ్మపల్లి గ్రామంలో లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోతు నరేశ్ నాయక్ ఆధ్వర్యంలో భర్త చనిపోయి కూరగాయలు అమ్ముకుంటూ కన్న తల్లిని, పిల్లలను పోషిస్తూ కుటుంబానికి అండగా ఉంటూ ఇతరులకు ఆదర్శంగా ఉంటున్న ఎర్ర లక్ష్మి అనే మహిళను గ్రామస్తుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్కరూ లక్ష్మిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. అలాగే మరిమడ్ల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికురాలు కుమ్మరి లక్ష్మిని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కదిరే శ్రీనివాస్, ఉప సర్పంచ్ దొంతర వేణి శ్రీనివాస్, గోగు ప్రతాపరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్ పాషా, పెంతల శ్రీనివాస్, ఇస్లావత్ రాజు, గూడూరి నరహరి, అవధూత శ్రీధర్, కుమ్మరి దిలీప్, జింక శ్రీనివాస్, పుల్కం మల్లేశం, శ్రీనివాస్, చిరంజీవి, జ్యోతి, నరసవ్వ తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

**ప్రజానావ, తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం రెచిని, గోపాల్ నగర్ ,అచ్చులాపూర్, తాండూరు ,రేపల్లెవాడ తదితర గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గతంలో నకిలీ విత్తనాల కేసులో పట్టుబడిన వ్యక్తుల ఇళ్లలో సోదాలతో పాటు అనుమానిత కలిగిన వ్యక్తులఇండ్లలో, డీలర్ల షాప్ దుకాణాల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. నిషేధిత విత్తనాలను ఎవరు అమ్మరాదని, రైతులు కూడా వాటిని వినియోగించే రాదని తెలిపారు. ఎక్కడైనా నిషేధిత విత్తనాలు అమ్మతున్నట్లుగాని నిల్వ ఉన్నట్లుగానే సమాచారం అందితే తమకు సమాచారం తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

# బెల్లంపల్లివాసికి డాక్టరేట్



**ప్రజానావ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన సింగతి ఉపేందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రకటించింది. ఉపేందర్ ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల విభాగ ప్రొఫెసర్ కె. ఎం ప్రవీణ గారి పర్యవేక్షణలో "ఎర్లీ ఇండియన్ డ్రామా ఇన్ ఇంగ్లీష్: ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ ప్లేస్ ఆఫ్ ప్రి ఇండిపెండెన్స్ ఎరా" అనే అంశంపై పరిశోధన జరిపి థీసిస్ ను రాసి సమర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

# నేడు పోచమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ



**ప్రజానావ, బెజ్జూర్:** మండల కేంద్రంలో పోచమ్మ విగ్రహాల గుణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అమ్మవారి విగ్రహాన్ని శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆదివారం పోచమ్మ విగ్రహ పునప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వాసులు, పోచమ్మ భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షునిగా గణపతి




**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ మండలం మున్నూరుకాపు సంఘం మండల కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం స్థలంలో జిల్లా అధ్యక్షులు మిట్ట వెంకన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత మండల అధ్యక్షులుగా సుంకరి పెంటయ్య ఉండగా అతని పదవి కాలం ముగిసిపోవడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా చిలుకూరి శంకర్, గుర్రాల వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా పొలంపల్లి గణపతి, ఉపాధ్యక్షులుగా పెద్దపల్లి శంకర్, కుందవరపు గోపాల్, ప్రధానకార్యదర్శిగా చిలుకూరి సతీష్, కోశాధికారిగా గడ్డల శంకర్, ప్రచార కార్యదర్శిగా పూధరి నారాయణ, జయింట్ సెక్రటరీగా మేకర్తి శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గడ్డల సురేష్, మనిగొండ వెంకటేశ్, గాజుల జక్కయ్య, మిట్ట తిరుపతి, గాజుల సత్యనారాయణ, బాల్దారపు మధుకర్, భూసి భీమేశ్, మిట్ట పోషణ, చిలుకూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ సబ్సిడీని వినియోగించుకోండి

## జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ప్రజానావ, ఆసిఫాబాద్:** భూములను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవనంలోనీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దరఖాస్తు దారులు , సబ్ రిజిస్టర్ రైటర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకొని రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించిందన్నారు. 25% తగ్గింపును దరఖాస్తుదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 31 లోపు అవకాశం ఉందని జిల్లాలోనీ రెండు మున్సిపలిటి పరిధిలో 3529 దరఖాస్తులు రాగా 3102 గుర్తించి ఎల్ ఆర్ ఎస్ కట్టేందుకు లెటర్స్ పంపించడం జరిగిందన్నారు. 335 గ్రామపంచాయతీలలో 4170 దరఖాస్తులు రాగా 1665 పెండింగ్లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 32 మంది ఎల్ ఆర్ ఎస్ కట్టి ప్రెసిడింగ్ లు పొందినట్లు వివరించారు. సులభతరమైన సేవలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ ఆర్ ఎస్ కట్టిన దరఖాస్తుదారుడు పూర్తి హక్కులను పొందుతారని తెలిపారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్ అధికారుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని కానీ ఇప్పుడు ఎల్ ఆర్ఎస్ రుసుము చెల్లిస్తే సంబంధిత అధికారులు పరిశీలిస్తారన్నారు. ఇంటి నిర్మాణంలో ఇబ్బందులు లేకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఎల్ ఆర్ ఎస్ కట్టాల్సి ఉంటుందన్నారు. బ్యాంకు రుణ సౌకర్యం కూడా పొందవచ్చని తెలిపారు. సమస్యలు నివృత్తి చేసుకునేందుకు గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులను నేరుగా వెళ్లి కలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్ సంబంధిత అధికారులు , దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# కీచక టీచర్ అరెస్ట్

## పరారీలో మరో ఉపాధ్యాయుడు




**ప్రజానావ, నర్సాపూర్(జీ) :** కీచక టీచర్లలో ఒకరైన ఆలూరు మోహన్ రెడ్డిని నర్సాపూర్(జీ) పోలీసులు శనివారం అరెస్ట్‌చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మోహన్ రావు కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్(జీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న గణిత టీచర్ మనోహర్ రెడ్డి, మరో ఉపాధ్యాయుడు మోహన్ రావు కొన్ని నెలలుగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇష్టమొచ్చినట్లు తాకుతూ.. డబుల్ మీనింగ్ డైలాగులతో చిన్నారులను భయభ్రాంతులకు గురి చేశారు. వారి వేధింపులు తాళలేక ఫిబ్రవరి 4న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారంతా పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఇద్దరు టీచర్లతోనూ తీవ్ర వాగ్వాదానికి దిగారు. విషయాన్ని పాఠశాల హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లినా, చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించిన బాధితులు కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఈవో.. టీచర్లు మోహన్ రావు, మనోహర్ రెడ్డి విద్యార్థినులను వేధిస్తున్నట్టు నిర్ధారించారు. దీంతో కలెక్టర్‌హెచ్ఎంతో పాటు టీచర్లను సస్పెండ్‌చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# ఆత్మహత్య



**ప్రజానావ, నర్సాపూర్(జీ):** అప్పుల బాధతో నీరటి గంగాధర్(44) గొల్లమడ గ్రామ శివారులోని నీరటి బుద్దేశ్వర్ వ్యవసాయ భూమికి దగ్గర ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నర్సాపూర్(జీ) ఠాణా హెడ్ కానిస్టేబుల్ ఎండీ జలాలుద్దీన్ అన్వర్ తెలిపారు.

# విద్యాఘాతంతో మూడు ఇండ్లు దగ్ధం

## ఒక ఎద్దు మృతి, మరో రెండు ఎడ్లకు తీవ్ర గాయాలు




**ప్రజానావ, ఆసిఫాబాద్ రూరల్ :** మండలంలోని ఆడదస్నాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి విద్యాదాఘాతంతో మూడు ఇండ్లు దగ్ధం అయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. ధారవత్ బలరాం, దారవత్ నాందేవ్, ధారవాత్ జమిందార్ నివాసాల పై నుంచి విద్యుత్ వైర్లు ఉండగా అవి రాత్రి సమయంలో గాలికి ఒకదానికి ఒకటి తగిలి మంటలు చెలరేగడంతోఇంటి సమీపం లో గడ్డి వాము పై పడటంతో మంటలు చెలరేగి ఇండ్లకు అంటుకున్నాయని అన్నారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వాహనం వచ్చేలోపు మూడు ఇండ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పక్కనే ఉన్న పశువుల పాకకు నిప్పు అంటుకోవడంతో ఒక ఎద్దు మృతి చెందగా, మరో రెండు ఏడ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ముగ్గురి నిత్యావసర వస్తువులు, టివి లు ఫ్రిజ్ లు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ లో సుమారు ఆరు లక్షల ఆస్తి నష్టం కలిగిందని తెలిపారు. విషయం తెలుసుకు సహకార సంఘం చైర్మెన్ ఆలీ బీన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంధం శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించి, కొంత నగదు ఆర్థిక సహాయం అందచేశారు. ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి తో మాట్లాడి బాధితులకు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి బాధితులకు పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



# ఎద్దు దాడిలో వృద్ధుడు మృతి

## అంత్యక్రియలకు వెడ్మ ఫౌండేషన్ సాయం



**ప్రజానావ, ఉట్నూర్ :** మండలంలోని శ్యాంపూర్ గ్రామానికి చెందిన మక్కల సాయిలు(70)ను శనివారం ఉదయం పూట ఎద్దు పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తీవ్రంగా చలించిపోయారు. మానవతా దృక్పథంతో స్పందించి సాయిలు అంత్యక్రియలకు వెడ్మ ఫౌండేషన్ తరుపున సాయిలు కుటుంబ సభ్యులకు రూ.5 వేల సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వెడ్మ ఫౌండేషన్ సభ్యులు మెస్రం నగేష్, కోరెంగ అక్షయ్, కనక సుధాకర్, కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అత్రం రాహుల్, ఉపాధ్యక్షుడు అరికిల్ల పరమేశ్వర్, మాజీ సర్పంచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

